సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 8 । మే । 2023



రెడ్'క్రాస్'అవుతున్న సేవా సంస్థ

ప్రాణాపాయ స్థితిలో రక్తం అందించి ఆదుకునే బాధ్యతగల రెడ్‌క్రాస్ సంస్థ పలు విమర్శలకు లోనవుతోంది. - 8లో



ప్రాణం తీసిన ఈత సరదా

సరదాగా ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు ఇద్దరు గల్లంతయ్యారు. ఒకరి మృతదేహం లభ్యమైంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.70	రూ.88
రెండోరకం	రూ.50	రూ.68

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 516 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు స్పందన కార్యక్రమం

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

10న ఊటీకి సమ్మర్ స్పెషల్ బస్సు

మదనపల్లె సిటీ: వేసవి సెలవులను పురస్కరించుకుని ఈనెల 10న ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఊటీకి సమ్మర్ స్పెషల్ బస్సును నడుపుతున్నట్లు ఆర్టీసీ టు డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. మదనపల్లె డిపో నుంచి రాత్రి 8 గంటలకు ఊటి, కోయంబత్తూరుకు రెండు రోజుల ట్రిప్పులు నడపనున్నట్లు తెలిపారు. యాత్రకు లగ్జరీ(పుష్ బ్యాక్ సీట్లు)ఉన్నాయన్నారు. రాను, పోను చార్జీ రూ.2250 చెల్లించాలన్నారు. వేసవి సెలవుల్లో యాత్రలకు వెళ్లాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9959225677, 916018667745ను సంప్రదించాలన్నారు.

అమ్మవారి దర్శనానికి ఆన్‌లైన్‌లో టికెట్లు



కార్యనిర్వహణాధికారి రవీంద్రరాజు

లక్కిరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ దేవస్థానంలో అమ్మవారి దర్శనం కోసం దేవదాయశాఖ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ టికెట్లు అందుబాటులో ఉన్నాయని కార్యనిర్వహణాధికారి రవీంద్ర రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారి సేవలో భాగంగా చిన్న తీర్థం, పెద్ద తీర్థం, ప్రత్యేక దర్శనం, అభిషేకం, అర్చనల కోసం ఆన్‌లైన్ టికెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

త్వరగా పనులు పూర్తి చేయండి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి

రాయచోటిటౌన్ : వంద పడకల ఆస్పత్రి భవనాల నిర్మాణాల పనులను త్వరగా పూర్తి చేయాలని నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్, మేస్త్రీలను ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణాల పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల తీరుపై ఆయన సంతృప్తి చెందారు. ఆయన వెంట ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సీటీఎం ఎస్టీ కాలనీలో 12 అడుగుల పాము



పామును పట్టుకుని చూపుతున్న స్థానికులు

మదనపల్లె: మండల పరిధిలోని సీటీఎం పంచాయతీ ఎస్టీ కాలనీ(చెంచులక్ష్మికాలనీ)లో ఆదివారం 12 అడుగుల పాము (జెర్రిపోతు) కనిపించింది. భారీ పాము జనావాసాల్లోకి రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. తరచూ కాలనీలోకి పాములు వస్తున్నాయని స్థానిక కాలనీకి చెందిన సిద్దయ్య, మునికాటయ్య, మల్లేష్, వెంకటేశ, ఉమాకుమారి, నిర్మల,గోపాల్ తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. పరిసరాల్లోని చెత్తాచెదారం తొలగించాలని కోరారు. అనంతరం పట్టుకున్న పామును స్థానికులు అటవీ ప్రాంతంలో వదిలివేశారు.

11న పుస్తక పరిచయ సభ

కడప కల్చరల్: బద్వేలుకు చెందిన కథా రచయిత యలిచెర్ల గజేంద్రనాథరెడ్డి రచించిన నా సీమ యాసే నా శ్వాస కథా సంపుటి పరిచయ సభను ఈనెల 11వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నారు. హైదరాబాదుకు చెందిన లలితకళాభిరామ పీంఛం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ శిల్పాకారుడు, కళారత్న గొల్లపల్లి జయన్న, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమానికి ఇంటాక్ కన్వీనర్ లయన్ చిన్నపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారు.

సర్కారు బడి.. మెరుగుపడి..

- పదో తరగతి పరీక్షలలో జిల్లాలో 72.05 శాతం ఉత్తీర్ణత
- ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు
- 11 పాఠశాలల్లో 100 శాతం పాస్
- బాలురు 68.33 శాతం, బాలికలు 75.81 శాతం ఉత్తీర్ణులు



మదనపల్లె: హిమసాయిని అభినందిస్తున్న వివేకానంద మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయులు

రాయచోటి: జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ సత్తా చాటారు. నూతనంగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లాలో విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ సూచనల మేరకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగడంతో మెరుగైన ఫలితాలు రాబట్టారని చెప్పవచ్చు. మనబడి, నాడు-నేడు కార్యక్రమాలతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ పాఠశాలల కంటే మెరుగైన వసతులు కల్పించడం, నాణ్యమైన విద్యను అందించడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియంతోపాటు ఇంగ్లీషు మీడియం కూడా ఉండడం పేద, మధ్య తరగతి విద్యార్థులకు మంచి అవకాశంగా మారింది. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణతోపాటు ఉదయం, సాయంత్రం వేళల్లో చదువుకునేలా ప్రభుత్వ పాఠశాలలోనే ఏర్పాటు చేయడం కలిసి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన పదోతరగతి పరీక్షలలో 71 ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

11 పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత

అన్నమయ్య జిల్లాలోని 11 ప్రభుత్వ పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాలల నుంచి 364 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ విజేతలుగా నిలిచారు. జిల్లాలోని పెద్దతిప్పసముద్రం మండలం, టి సదుం జెడ్పీ హైస్కూల్‌లో పది మందికిగాను ఒకరు, మదనపల్లి పట్టణ పరిధిలోని జీఆర్‌టీ హైస్కూల్‌లో 9 మందికి ఒకరు, పెనగలూరు మండలం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 78 మందికి 12 మంది, అదే మండలంలోని కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 19 మందికి ముగ్గురు వంతున ఉత్తీర్ణత సాధించి 15 శాతం లోపే ఉత్తీర్ణత సాధించారు. మరో 35 పాఠశాలల్లో 25 నుంచి 40శాతం లోపు ఉత్తీర్ణత సాధించి జిల్లా పేరు నిలబెట్టారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు

ఓబులవారిపల్లి ఏపీఆర్ఎస్(బి) ముక్కావారిపల్లిలో 80 మంది, కేవీపల్లి మండలం, గ్యారంపల్లి ఏపీఆర్ఎస్(బీ)లో 83 మంది, సంబేపల్లి మండలం, కేజీబీవీ పాఠశాలలో 38 మంది, కలికిరి మండలం, ఎంజేపీఏ పీబీసీడబ్ల్యుఆర్ పాఠశాలలో 67 మంది, లక్కిరెడ్డిపల్లి జెడ్పీ హైస్కూల్ ఉర్దూ పాఠశాలలో 23 మంది, పీలేరు జెడ్పీ హైస్కూల్ ఉర్దూలో 11 మంది, సంబేపల్లి మండలం, జంగంపల్లి హైస్కూల్‌లో 13 మంది, గుర్రంకొండ మండలం, మర్రిపాడు జెడ్పీ ఉర్దూ హైస్కూల్‌లో 12 మంది, తంబళ్లపల్లి బాలికల జెడ్పీ హైస్కూల్‌లో 14 మంది, పీలేరు మండలం శివరామపురం జెడ్పీ హైస్కూల్‌లో 11 మంది, రామాపురం మండలం గువ్వల చెరువు ఉర్దూ జెడ్పీ హైస్కూల్‌లో 12 మంది 100శాతం ఉత్తీర్ణత సాధించారు.

పాఠశాలల వారిగా ఉత్తీర్ణుల వివరాలు..

జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9917 మందికి 5926 మంది ఉత్తీర్ణత సాధించారు, సోషల్ వెల్ఫేర్‌లో 773 మందికి 608 మంది పాసయ్యారు. ఎయిడెడ్ పాఠశాలలో 281 మందికి 149 మంది ఉత్తీర్ణులయ్యారు. ట్రైబల్ వెల్ఫేర్‌లో 252 మందికి 179 మంది పాసయ్యారు. ఏపీఎంఎస్‌లో 1469 మందికి 1217 మంది, ఏపీఆర్ఎస్‌లో 350 మందికి 311 మంది, బీసీ వెల్ఫేర్‌లో 252 మందికి 236 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 828 మందికిగాను 43 మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీలో 753 మందికి 55 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.పురపాలక పాఠశాలలో 766 మందికి గాను 460 మంది పాసయ్యారు.

బాలికలే టాప్..

ఈ ఏడాది కూడా జిల్లాలో పరీక్షా ఫలితాలలో బాలికలు టాప్‌గా నిలిచారు. పదోతరగతి పరీక్షలకు 22219 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో బాలురు 11158 మంది, బాలికలు 11061 మంది ఉన్నారు. ఈ పరీక్షలలో 16009 మంది బాలబాలికలు ఉత్తీర్ణత సాధించారు. దీంతో అన్నమయ్య జిల్లాలో ఉత్తీర్ణత 72.05 శాతంగా నిలిచింది. వీరిలో బాలురు 68.33 శాతం, బాలికలు 75.81 శాతం ఉన్నారు.

కష్టపడి ఇష్టంతో చదివారు

ఈ సంవత్సరం విద్యార్థులు బాగా కష్టపడి ఇష్టంతో చదివారు. అందువల్ల ప్రతి సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉందని జిల్లా ఇన్‌చార్జి డీఈఓ ప్రసాద్ బాబు తెలిపారు.

నేతన్న బిడ్డలు.. చదువులో దిట్టలు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల (మాయాబజార్)లో పది చదివిన వేల్పుల నందిని 586 మార్కులు సాధించింది. తండ్రి వెంకటసుబ్బయ్య చేనేత కార్మికుడు. తల్లి ప్రభావతి గృహిణి. మగ్గం నేస్తేనే ఇల్లు గడుస్తుంది. నేత కార్మికుని బిడ్డ చదువులో రాణిస్తోంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నదే ధ్యేయమని నందిని చెబుతోంది.

- మదనపలె వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల (ఆర్.ఆర్ లేవుట్)లో పది చదివిన దండి హిమసాయికి 584 మార్కులు వచ్చాయి. తండ్రి ఆదినారాయణ, రాజేశ్వరిలు చేనేత కార్మికులు. చిన్నప్పటి నుంచి చదువులో రాణిస్తున్న హిమసాయిని ప్రోత్సహించారు. సివిల్స్ రాసి ఐఏఎస్ చేయాలన్నదే తన లక్ష్యమని హిమసాయి పేర్కొంటోంది.

పదిలో మెరిసిన వీధి వ్యాపారి కుమార్తె



తండ్రి ఆదిమూర్తితో రెడ్డిరాఘవి

మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన కె.రెడ్డిరాఘవికి 573 మార్కులు వచ్చాయి. తండ్రి కె.ఆదిమూర్తి తమలపాకులు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. తల్లి రెడ్డమ్మ గృహిణి. ఐపీఎస్ కావాలన్నదే తన ధ్యేయం అంటోంది రెడ్డి రాఘవి.

మెరిసిన వై.కోట విద్యార్థి



బజారు వాసును సన్మానిస్తున్న వై.కోట సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య, గ్రామస్తులు

ఓబులవారిపల్లి: మండల పరిధిలోని వై.కోట జిల్లా పరిషత్ విద్యార్థి బజారు వాసు పది పరీక్షలో 600 మార్కులకు 580 మార్కులు సాధించి నియోజకవర్గంలో టాపర్‌గా నిలిచాడు. ఎం.సంతోష్ కూమార్ 575 మార్కులు సాధించాడు. వై.కోట సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య, గ్రామస్తులు బజారు వాసును శాలువతో ఘనంగా సన్మానించారు. .

అమ్మా..నాన్న కష్టం చదివేలా చేసింది



తల్లిదండ్రులతో మల్లికార్జున

నా పేరు మల్లికార్జున. మా అమ్మ లోకేశ్వరి..నాన్న హనుమంతు కష్ట జీవులు. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో చేనేత కార్మికులుగా ఉన్నారు. మాది వైఎస్సార్ జిల్లా గాలివీడు దగ్గర రామాపురం . 30 ఏళ్లుగా మదనపల్లెలో స్థిరపడ్డాం. కురబలకోట మండలం ముదివేడు దగ్గరున్న ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో చదివా. పది ఫలితాల్లో 600కు 590 మార్కులు వచ్చాయి. ఇంటర్‌లో ఎంపీసీ చదువుతా. సాఫ్ట్‌వేర్‌తో పాటు ఉన్నత చదువులు చదవాలని ఉంది. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ యోజన గాంధీ, అధ్యాపకులు మాపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించారు. దీనికి తోడు మా అమ్మనాన్న కష్టం నేను చదివిన ప్రతి పేజీలో కన్పించేది. దీంతో పట్టుదలతో చదివా.

పేదింటి బిడ్డ మండల టాపర్



తల్లిదండ్రులతో మండల టాపర్ సౌజన్య

రాజంపేట టౌన్: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన సౌజన్య 576 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల విభాగంలో టాపర్ స్థానాన్ని దక్కించుకుంది. ఈమె తల్లిదండ్రులు చంద్ర, గంగాదేవి ఇద్దరు కూడా కూల్‌డ్రింక్స్ విక్రయించుకొని జీవనం సాగిస్తున్నారు. సౌజన్య చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి ఇంజనీర్ కావాలన్నదే తన ఆశయం అని ఆ బాలిక తెలిపింది.

ఉగ్రంను ఆదరించినందుకు ధన్యవాదాలు

- సినీ నటుడు అల్లరి నరేష్
- కడప పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



పెద్దదర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న సినీ నటుడు అల్లరి నరేష్, చిత్ర యూనిట్‌సభ్యులు

కడప కల్చరల్ : తాను ప్రధానపాత్రలో నటించిన ఉగ్రం చిత్రాన్ని ఆదరించినందుకు ప్రేక్షక దేవుళ్లందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని ప్రముఖ సినీ నటుడు అల్లరి నరేష్ అన్నారు. ఆదివారం ఉగ్రం చిత్రం విజయయాత్రలో భాగంగా చిత్ర దర్శకుడు విజయ్, కథానాయిక మీరా మీనన్, ఇతర యూనిట్ సభ్యులతో కలిసి ఆయన కడపకు విచ్చేశారు. తొలుత స్థానిక అమీన్‌పీర్ పెద్దర్గాను దర్శించుకున్నారు. దర్గా ప్రతినిధి అమీర్ ఆయనకు స్వాగతం పలికి సంప్రదాయ దుస్తులను ధరింపజేశారు. ఈ సందర్భంగాగా నరేష్ చాదర్‌ను ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గా గురువుల మజార్‌పై సమర్పించి ప్రార్థనలు నిర్వహించారు. ముజావర్ అమీర్ వారికి దర్గాలోని ఇతర గురువుల మజార్లను కూడా దర్శింపజేసి దర్గా గురువుల చరిత్ర, విశిష్టతలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్గాను దర్శించుకోవడం ఇది రెండవసారి అని, దర్గా గురువుల మహిమల గురించి ఎంతో విన్నానని, రెండవసారి తన చిత్రం విజయవంతమైన సందర్భంగా రావడం గొప్ప అనుభూతి ఇస్తోందని తెలిపారు. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించడం సంతోషంగా ఉందని, అందరూ తప్పక ఈ సినిమాను చూడాలని కోరారు. ఈ ప్రోత్సాహంతో భవిష్యత్తులో ఇంకా మంచి చిత్రాల్లో నటించేందుకు ప్రయత్నిస్తానని, విజయయాత్రలో భాగంగా ఉగ్రం సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్‌కు వెళ్లనున్నట్లు తెలిపారు. తనను చూసేందుకు వచ్చిన అభిమానులకు అభివాదం చేసి ఉత్సాహ పరిచారు.

థియేటర్‌లో నరేష్ 'అల్లరి'

అనంతరం కడపలో ఉగ్రం సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్‌కు వెళ్లారు. థియేటర్ యాజమాన్యం, అభిమానులు హర్షధ్వానాలతో ఘనంగా స్వాగతం పలికారు. థియేటర్‌లోకి వెళ్లిన ఆయన సినిమాకు విజయం చేకూర్చినందుకు ప్రేక్షకులను ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి మరిన్ని చిత్రాలు చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ప్రేక్షకులు ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు, కరచాలనం చేసేందుకు పోటీలు పడ్డారు.

ప్రశాంతంగా నీట్ అర్హత ప్రవేశ పరీక్ష



కడప ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద వేచి ఉన్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ వైద్య విద్యలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఆదివారం నిర్వహించిన నీట్ అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచి పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. వైఎస్సార్ జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాలకు 2185 మంది విద్యార్థులకు 2144 మంది హాజురుకాగా 41 మంది గైర్హాజరైనట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కో ఆర్డినేటర్ హరికృష్ణ తెలిపారు. కడప అన్నమాచార్య ఇంజినీరింగ్ పరీక్షా కేంద్రంలో 720 మందికి 705 మంది హాజరుకాగా 15 మంది గైర్హాజరయ్యారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో 408 మందికి 401 మంది హాజరయ్యారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 409 మందికి 400 మంది, ఖాజీపేట బీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్లో 648 మందికి 638 మంది హాజరయ్యారు.

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు



అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మేడా, ఆకేపాటి

ఎమ్మెల్యే మేడా, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి

రాజంపేట టౌన్: బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తెలిపారు. అల్లూరి సీతారామరాజు వర్థంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి వీరు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప మహనీయుడు అల్లూరి అన్నారు. దేశం, పేద ప్రజల కోసం ఆయన చేసిన త్యాగం ఎప్పటికి మరువలేనిదని తెలిపారు. కాగా అల్లూరి సీతారామరాజు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని క్షత్రియ సంఘం నాయకులు ఎమ్మెల్యే, జెడ్పీ ఛైర్మన్‌లను కోరారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, ఎస్టీ కమిషన్ మెంబర్ శంకర్ నాయక్, కౌన్సిలర్ రాఘవరాజు, క్షత్రియ సంఘం నాయకులు డి.భాస్కర్‌రాజు, హెచ్‌వీ.రాజు, వరదరాజు, సుబ్రమణ్యంరాజు, వెంకటరాజు, ఎలమరాజు, వెంకటసుబ్బరాజు, మహేంద్రరాజు, రామలింగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహదానందం.. దళిత గోవిందం

- టీటీడీ చరిత్రపుటల్లో మైలురాయి
- కొండ దిగి దళితుల వద్దకు వచ్చిన తిరుమలేశుడు
- తాళ్లపాక దళితవాడలో నాడు శ్రీవారి కల్యాణం అపూర్వఘట్టం
- దళితగోవిందంను కొనియాడిన విశాఖ శారదాపీఠం జయేంద్రసరస్వతి



తాళ్లపాకల హరిజనవాడలో నిర్వహించిన దళితగోవిందం (ఫైల్)



తాళ్లపాక దళితవాడలో జరిగిన శ్రీవారికళ్యాణోత్సవంలో దళితజంట (ఫైల్)

రాజంపేట: సరిగ్గా 15 యేళ్ల కిందట అంటే పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 600వ జయంత్యుత్సవాలను తాళ్లపాక, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం ప్రాంతంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో అప్పటి తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి చైర్మన్ , ప్రస్తుత తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. అవి టీటీడీ చరిత్ర పుటల్లో మైలురాయిగా నిలిచిపోయాయి.

దళిత గోవిందంకు..దశాబ్దంన్నర..

ప్రస్తుతం అన్నమాచార్యుని 615వ జయంత్యుత్సవాలను టీటీడీ నిర్వహిస్తోంది. తాళ్లపాక దళితవాడలో నిర్వహించిన దళిత గోవిందం 15యేళ్లు పూర్తి చేసుకుంది. భూమన కరుణాకర్‌రెడ్డి మదిలో మెదిలిన పవిత్ర కార్యక్రమం..దళితగోవిందం.. అన్నమాచార్యుడి జన్మస్థలి తాళ్లపాక దళితవాడలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిపోయింది. తిరుపతిలో జరిగిన గంగమ్మ జాతర సందర్భంగా అక్కడికి విచ్చేసిన విశాఖ శారదపీఠం జయేంద్ర సరస్వతి దళితగోవిందం కార్యక్రమాన్ని గుర్తుచేసుకుంటూ మహా అద్భుత కార్యక్రమమని కొనియాడారు.

కొండదిగి వచ్చిన తిరుమలేశుడు..

దళితగోవిందం కార్యక్రమంలో భాగంగా తాళ్లపాక దళితవాడకు తిరుమలేశుడు కొండదిగి వచ్చాడన్నట్లుగా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు, పురోహితులు, టీటీడీ ఉన్నతాధికారులు, టీటీడీ చైర్మన్ దళితవాడలోనే మకాం వేశారు. శ్రీవారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దళితులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. స్వయంగా దళితులకు భోజనాలను వడ్డించారు. వారితో కలిసి దళితవాడలోనే నిద్రపోయారు. ఇదంతా ఒక మరపురాని ఘట్టంగా చెప్పుకోవచ్చు.

మా పల్లెకు దేవదేవుడు వస్తాడనుకోలేదు



మా మాలపల్లెకు కొండపై ఉన్న దేవదేవుడు వస్తాడనుకోలేదు. స్వామి వైభవం చూస్తామని ఊహించలేదు. మా దంపతులకు శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొనే అదృష్టం దక్కింది. ఆ నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, అప్పటి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దళితగోవిందం కార్యక్రమంతో మాకు మహాభాగ్యం కల్పించారు. – మల్లెం వెంకటయ్య, సుబ్బులక్షుమ్మ దంపతులు

అదొక అద్భుత కార్యక్రమం



ఆనాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చేపట్టిన దళితగోవిందం అద్భుత కార్యక్రమం..ఇప్పటికి 15 యేళ్లు అవుతున్నా మరువలేకున్నాం. ఇలాంటివి ఎవరు చేయలేరు..చేయరు కూడా.. అది వారిద్దరికే చెల్లు. ఎక్కడో కొండపై ఉన్న శ్రీదేవి,భూదేవి, శ్రీవెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహమూర్తులు మా పల్లెకు వచ్చాయంటే అది కలలో అనుకున్నాము. కాని అది నిజమని సంబరపడ్డాము. పెద్దఎత్తున స్వాగతం పలికాము. – గోర్ల పెంచలయ్య, దళితవాద, తాళ్లపాక

ఆ శ్రీహరే మాపల్లెకు వచ్చాడనుకున్నాం



సాక్షాత్తు ఆ కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ హరే మా పల్లెకు వచ్చాడనుకున్నాం. టీటీడీ చైర్మన్ ఆధ్వర్యంలో మా దళితవాడలో దళితగోవింద కార్యక్రమం చేపడుతున్నారని తెలిసి సంబరపడ్డాము. వేదపండితులు, అర్చకస్వాములు, టీటీడీ ఉన్నతాధికారులు పల్లెలో నిద్రించారు, మాతో కలిసి భోజనం చేశారు. దళితగోవిందంతో మా పల్లె పులకించిపోయింది. – మల్లెం పెంచలయ్య, దళితవాడు, తాళ్లపాక

క్లుప్తంగా

వృద్ధుడి అదృశ్యం


షేక్ ఖాదర్‌వల్లి (ఫైల్)

ఓబులవారిపల్లె : మండల కేంద్రానికి చెందిన షేక్ ఖాదర్‌వల్లి (84) గత నెల 20 నుంచి కనిపించడం లేదని కుమారుడు షేక్ జామల్‌వల్లి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి ప్రొద్దుటూరుకు ఉదయం ఇంటర్‌సిటీ ప్యాసింజర్ రైలులో బయలుదేరాడని, అయితే ప్రొద్దుటూరుకు వెళ్లలేదని పేర్కొన్నాడు. అప్పటి నుంచి ఎక్కడ వెతికినా కనిపించడం లేదని తెలిపారు.

మణిపూర్‌లో కడప విద్యార్థిని ఆవేదన

కడప అర్బన్ : కడపకు చెందిన జాహ్నవి అనే విద్యార్థిని మణిపూర్ రాష్ట్రంలో తీవ్ర భయాందోళనకు గురవుతోంది. అక్కడ జరుగుతున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో.. ఆమె ఉంటున్న హాస్టల్‌లోని విద్యార్థినులు బిక్కుబిక్కుమని గడుపుతున్నారు. దీంతో జాహ్నవి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కడప మృత్యుంజయ కుంటకు చెందిన వెంకటరమణ, సుస్మితకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె జాహ్నవి కడపలో ఇంటర్ పూర్తి చేసి నీట్ రాసింది. గతేడాది మణిపూర్‌లో ఎంబీబీఎస్‌లో సీటు వచ్చింది. ఇల్‌ఫాల్ నగరం నీట్ క్యాంపస్‌లో చదువుతోంది. ఆమెను ఇక్కడికి రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

రెడ్‘క్రాస్’ అవుతున్న సేవా సంస్థ

- ఇష్టారాజ్యంగా కొందరు ఉద్యోగులు
- పర్యవేక్షణ లోపమే సంస్థకు శాపం


కడపలోని రెడ్‌క్రాస్ భవనం

కడప కల్చరల్ : ప్రాణాపాయ స్థితిలో రక్తం అందించి ఆదుకునే బాధ్యతగల ఆ సంస్థ పలు విమర్శలకు లోనవుతోంది. పూర్తి స్థాయి పర్యవేక్షణ లేక పార్ట్‌టైం సేవలు చాలకపోవడంతోపాటు కొందరు ఉద్యోగుల నిర్లక్ష్యంతో సంస్థ ప్రతిష్ట నానాటికీ మసకబారుతోంది. సిబ్బంది సంఖ్యకు తగినంత పనిలేకుండా పోవడంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఈ నెల 8న ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా డెడ్(రెడ్)లైన్ క్రాస్ అవుతున్న సంస్థ పరిస్థితుల గురించి కథనం.

విమర్శల జడిలో..

అద్భుతమైన పనితీరుతో పలుమార్లు జాతీయ పతకాలు సాధించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఇటీవల విమర్శలకు నిలయంగా మారుతోంది. చాలా ఏళ్లుగా పాలక మండలి లేకపోవడం, కనీసం అడ్‌హాక్ కమిటీ కూడా లేకపోవడంతో పర్యవేక్షణ లోపించింది. ఇటీవల ప్రత్యేక అధికారిని నియమించినా రెండు జిల్లాల కార్యభారం పూర్తి స్థాయి సేవలు అందించేందుకు అవకాశం లేకుండా పోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రెడ్‌క్రాస్ సంస్థలో నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, ఒకరు చొప్పున వైద్యుడు, నర్సు, కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు స్వీపర్లు ఉన్నారు. పర్యవేక్షణ లోపం, తగినంత పని లేకపోవడంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు కొన్ని ఉదాహరణలు

ఇక్కడా.. అక్కడా..

మూడేళ్ల క్రితం చేరిన ఓ తాత్కాలిక ఉద్యోగి రెడ్‌క్రాస్‌తోపాటు కడప రిమ్స్ ఆస్పత్రిలో కూడా పని చేస్తున్నట్లు ప్రజా సంఘాలు, రెడ్‌క్రాస్ సీనియర్ సభ్యులు ఓ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయగా, ఆ ఉద్యోగి జాగ్రత్తపడి ఫిబ్రవరి నుంచి విధులకు రావడం లేదు. ఒకే సమయానికి రెండు వేర్వేరు ప్రభుత్వ కార్యాలయాల నుంచి జీతం తీసుకుంటున్న విషయం ప్రజాసంఘాల ద్వారా బయటపడింది. సదరు ఉద్యోగి రెడ్‌క్రాస్‌లో పని చేస్తున్న సమయంలో ఎక్కువ భాగం నిద్రపోతున్న వీడియోలను సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు. పనివేళల్లో నిద్రపోవడం గురించి రక్తదానం చేసేందుకు వచ్చిన ఓ స్వచ్ఛంద సేవకుడు ప్రశ్నించగా.. ఆమె కులం కార్డు అడ్డుపెట్టి పెద్ద గొడవ చేయగా, ఈ విషయం పై అధికారులకు కూడా తెలియడంతో ఆ ఉద్యోగిని తొలగించారు.

నేను పెద్ద అధికారి క్యాండెట్‌ను

నేను పెద్ద అధికారి క్యాండెట్‌ను. నా జోలికి రావద్దు అంటూ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్న రెడ్‌క్రాస్ కార్యాలయంలోని మరో ఉద్యోగి పట్ల కూడా తీవ్ర విమర్శలు ఉన్నాయి. ఆయన మరో చోట ప్రార్థనాలయం లో కూడా పని చేస్తున్నట్లు తెలుస్తోంది. విధులకు ఆలస్యంగా రావడం, ఆ కొద్ది సమయంలో కూడా ప్రార్థనాలయం పనులే చేస్తుండడం లేదా కార్యాలయంలోనే నిద్రపోవడం, ఇదేంటని ప్రశ్నించిన సహచర సిబ్బందిపై తాను పెద్ద అధికారి క్యాండెట్‌ను, తన జోలికి రావద్దంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఓ మహిళా ఉద్యోగి పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో ఆమె ప్రత్యేక అధికారికి ఫిర్యాదు చేయడంతో ఆ ఉద్యోగిని వివరణ కోరినట్లు తెలుస్తోంది. అధికారి దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి నుంచి స్పందన లేకపోవడం పట్ల కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ ఉద్యోగి ఇతర ఉద్యోగుల పట్ల కూడా అలాగే ప్రవర్తిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. మరిన్ని ఆధునిక యంత్రాలను సమకూర్చుకుని ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పూర్తి స్థాయిలో సేవలు అందించాల్సిన ఉద్యోగులు సంస్థ ప్రతిష్ట మసకబారేలా ప్రవర్తించడం పట్ల పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని ప్రతికూల పరిస్థితుల్లో కూడా అధికారులు రెడ్‌క్రాస్ సేవల్లో లోపం లేకుండా నెట్టుకొస్తుండడం ఊరటనిచ్చే అంశం. పరిస్థితులు రచ్చకెక్కకముందే చక్కబెట్టకపోతే భవిష్యత్తులో సంస్థ ప్రతిష్ట మరింత దిగజారే ప్రమాదముందని పలువురు హెచ్చరిస్తున్నారు.

అధికారి వివరణ

ప్రతి కార్యాలయంలోనూ ఇలాంటి సమస్యలు సాధారణం. వీటిని సంయమనంతో సరిదిద్ది కార్యక్రమాలు సజావుగా జరిగేలా చూస్తుంటాం.

– సాయిగ్రేస్, జిల్లా స్టేప్ అధికారి, కడప

గాయపడిన వ్యక్తి మృతి

రామాపురం : జిల్లాలోని కలకడ మండలం నడింపల్లెకు చెందిన కె.రాజశేఖర్(43) అనే వ్యక్తి ఆదివారం చికిత్స కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. వివరాలలోకి వెళ్లితే.. రాజశేఖర్ కడప నుంచి రాయచోటికి స్కూటర్లో వెళ్తుండగా కర్నూలు–చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లె టోల్‌గేట్ వద్ద అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ సంఘటనలో తీవ్రగా గాయపడిన రాజశేఖర్‌ను చికిత్స కోసం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆదివారం మెరుగైన వైద్యం కోసం రాయచోటి నుంచి తిరుపతికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతుండగా..


మౌలా (ఫైల్)

కురబలకోట : మండలంలోని అంగళ్లుకు చెందిన వెల్డర్ మౌలా (29) విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. అంగళ్లుకు చెందిన మౌలా వెల్డర్‌గా పని చేసేవాడు. అలాగే బీరువాల వర్క్‌షాపులో పని చేశాడు. అనంతరం గాలివీడు మండలం అరవీడులో పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో 15 రోజుల క్రితం ఓ షెడ్డుకు రేకులు అమర్చడానికి వెల్డింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో పై నుంచి కింద పడ్డాడు. తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వేలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషకుడు మృతి చెందడంతో బాధిత కుటుంబం తల్లడిల్లుతోంది.

పోలీస్‌స్టేషన్ ఎదుట వివాహిత ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుధా

మదనపల్లె : భర్త తనను మోసం చేసి రెండో పెళ్లి చేసుకున్నాడని, ఏడాది కాలంగా తనకు న్యాయం జరగలేదని మనస్తాపంతో ఓ వివాహిత ఆదివారం పోలీసుస్టేషన్ ఎదుట ఆత్మహత్యకు ప్రయత్నించింది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా బేతమంగళానికి చెందిన సుధా(34) మదనపల్లె మండలం కొత్తిండ్లుకు చెందిన బాలప్రసాద్‌తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి బాలాజీ(8) అనే కుమారుడు ఉన్నారు. అయితే భర్త, అత్త తనను వరకట్న వేధింపులకు గురి చేస్తూ చిత్ర హింసలు పెడుతున్నారని, బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ సుధా గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బాలప్రసాద్‌పై వరకట్నం, హత్యాయత్నం కేసులు నమోదు చేసి తాలూకా పోలీసులు రిమాండ్‌కు పంపారు. అనంతరం ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే ఆదివారం సుధా మదనపల్లె తాలూకా పోలీసుస్టేషన్‌కు వచ్చింది. తన భర్త రెండో పెళ్లి చేసుకుని తనను మోసం చేశాడని న్యాయం చేయాల్సిందిగా కోరింది. అయితే ఎస్‌ఐ, సీఐలు లేరని వారు వచ్చాక రావాలని స్టేషన్ సిబ్బంది చెప్పారు. దీంతో ఆమె స్టేషన్ బయటకు వచ్చి తన వెంట తెచ్చుకున్న పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. తన భర్త తనను మోసం చేసి రెండో పెళ్లి చేసుకోవడంపై పోలీసులు కేసు నమోదు చేయలేదని, ఏడాదిగా తనకు న్యాయం జరగలేదని ఆరోపించింది. బాధితురాలిని వెంటనే పోలీసులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ సమస్యలతో మరో ఇద్దరు

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యకు ప్రయత్నించారు. రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీ దిన్నెమీద దళితవాడకు చెందిన వేణు (28) డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెంది పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అదే విధంగా బి.కొత్తకోట పట్టణం బీసీ కాలనీకి చెందిన విద్యార్థి ఏ.చరణ్‌తేజ (19) తల్లిదండ్రులతో గొడవపడి క్రిమి సంహారిణి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- నలుగురు స్నేహితులు వెళ్లి..
- మట్టిగుంతలో ఇద్దరు గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం
- చీకటి పడటంతో గాలింపునకు బ్రేక్



యశ్వంత్‌గౌడ్ మృతదేహం, ధనుష్ (ఫైల్)

రాజంపేట : ఈత సరదా ఇద్దరి ప్రాణం తీసింది. పట్టణంలోని మన్నూరు, గంగిరెడ్డిపాలెంకు చెందిన నలుగురు స్నేహితులు కార్తీక్, హేమంత్, యశ్వంత్‌గౌడ్, ధనుష్‌లు ఆదివారం సరదాగా ఊటుకూరు చెరువు పరిధిలోని మట్టిగుంత(గాలివారిపల్లె సమీపం)లో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో మట్టిగుంతల్లో ప్రమాదవశాత్తు ఇద్దరు గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న పట్టణ సీఐ నరసింహారావు ఆదేశంతో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకొని గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాజంపేట అగ్నిమాపక శాఖ అధికారి బి.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ సత్యరాజు, ఫైర్‌మెన్ చక్రవర్తి, వెంకటసుబ్బయ్య, డ్రైవర్ రాజన్నతోపాటు, మరికొందరి యువకులతో గాలింపు చేపట్టారు.

ఒకరి మృతదేహం లభ్యం

మన్నూరులోని శారదాస్కూల్ వెనుకవైపు వీధిలో ఉంటున్న శ్రీనివాసులు కుమారుడు దాసరి యశ్వంత్ కుమార్ గౌడ్ (23) మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

రాత్రి కావడంతో గాలింపునకు బ్రేక్

రాత్రి కావడంతో మట్టిగుంతలో గాలింపును నిలిపివేశారు. ఈ మేరకు సీఐ నరసింహారావు విలేకర్లతో మాట్లాడుతూ నలుగురు స్నేహితులు సరదాగా ఈతకు వె వెళ్లారని, వీరంతా చదువుకున్నవారేనన్నారు. కాగా గల్లంతైన వారిలో గంగిరెడ్డిపాలెంకు చెందిన కృష్ణ తనయుడు గంపల ధనుష్ (20) అనే యువకునిగా గుర్తించామన్నారు. సోమవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపడతామన్నారు.

ఇరు కుటుంబాలకు ఒక్కొక్కరే..

మన్నూరులో నివాసం ఉంటున్న దాసరి శ్రీనివాసులు, ప్రసన్నలక్ష్మీ దంపతులకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఇందులో ఒకరు ముందుగానే చనిపోయారు. ఉన్న కుమారుడు యశ్వంత్‌గౌడ్ ఈతకు వెళ్లి మృతిచెందారు. తండ్రి చనిపోవడంతో తల్లి ఆలనాపాలన చూసుకుంటోంది. కాగా మరో యువకుడు ధనుష్ తండ్రి కృష్ణ కడప ఆర్టీవో కార్యాలయంలో పని చేస్తున్నారు. ధనుష్ కూడా ఒకడే కుమారుడు కావడం గమనార్హం. ధనుష్ మృదేహం లభ్యం కాలేదు. దీంతో ఈ రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


నీటిలో గాలింపు చర్యలు చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు

చేపల వేటకు వెళ్లి..

పెద్దతిప్పసముద్రం : చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఆదివారం మృతి చెందిన సంఘటన పులికల్లులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పులికల్లు దళితవాడకు చెందిన మిట్టపల్లి కిట్టన్న (54) చేపలు పట్టేందుకు సమీపంలోని పెద్ద చెరువు వద్దకు వెళ్లాడు. అతనికి ఈత రాకపోవడంతో ఒడ్డున నిలుచొని.. గాలంతో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు జారి చెరువులో పడిపోయాడు. చెరువు కట్టపై ఆటలాడుతున్న పిల్లలు ఈ ఘటన చూసి కేకలు వేశారు. చుట్టు పక్కల ఉన్న పశు కాపరులు చెరువులో దూకి అతన్ని కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. నీటిలో ఊపిరాడక చనిపోయిన కిట్టన్నను చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.


కిట్టన్న మృతదేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

అంగరంగ వైభవం.. వెల్లాల రథోత్సవం


చెన్నకేశవస్వామి రథం లాగుతున్న భక్తులు


రథోత్సవంలో పాల్గొన్న జనసందోహం

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సంప్రదాయ బద్ధంగా వేద పండితులు హోమం నిర్వహించి, పూజలు చేసి.. స్వామివారి రథంను ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, ఈఓ నరసయ్య, సర్పంచ్ రాధ, ఎస్‌ఐ రాజగోపాల్, భక్తులు ప్రారంభించారు. ముందుగా తిరునాలకు వచ్చిన కొంతమంది భక్తులు తలనీలాలు సమర్పించి కుందూనదిలో స్నానాలు చేశారు. వివిధ రకాల బొమ్మల అంగళ్లు ఏర్పాటు చేయడంతో ఆలయం వద్ద నూతన శోభ సంతరించుకుంది. పెద్దసంఖ్యలో ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వాములను దర్శించుకున్న అనంతరం పిల్లలతో కలిసి ఆనందంగా తిరిగారు. స్వాముల వారిని ఇన్‌స్పెక్టర్ నరసింహా సింగ్, ఈఓ నరసయ్య, ఎంపీటీసీ సభ్యుడు శివనాగిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు మధుసుదనరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, కానాల రామచంద్రారెడ్డి, ఆయా గ్రామాల్లోని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రథం వద్దకు గ్రామానికి చెందిన కొంత మంది మహిళలు బోనాలు సమర్పించిన అనంతరం రథాన్ని ముందుకు కదిలించారు. అర్చకులు మాధవాచార్యులు, పట్టాభిరామన్, వెంకటా చలపతి, పవన్, శేషాచార్యులు, నవీన్, సురేంద్ర పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ


తిరునాలకు వచ్చిన భక్తులకు కుమ్మరపల్లె సచివాలయ ఉద్యోగులు, గోట్లూరు, జంగాలపల్లె, నేలటూరు, రాజుపాళెం గ్రామానికి చెందిన కొంత మంది భక్తులు మజ్జిగ, బ్యాళ్లు, పానకం పంపిణీ చేశారు. ఎటువంటి సమస్యలు జరగకుండా ఎస్‌ఐ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లెలో శ్రీ రేణుకాయల్లమాంబ తిరునాల సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన వృషభ రాజములచే బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో మొత్తం 6 జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.1,00,116 లను అనంతపురం జిల్లా ఉరవకొండ గ్రామానికి చెందిన మహ్మద్ అలీ ఎద్దులు గెలుచుకున్నాయి. రెండవ బహుమతి రూ.70,116లను ప్రకాశం జిల్లా, బేస్తవారిపేట మండలం జే.సీ అగ్రహారం గ్రామానికి చెందిన లక్కు సాయి శివశంకర్ ఎద్దులు సాధించాయి. మూడవ బహుమతి రూ. 50,116లను వైఎస్ఆర్ జిల్లా, నరసాపురం మండలానికి చెందిన కె.సాయి ప్రతాప్‌రెడ్డి కైవసం చేసుకున్నాయి. నాల్గవ బహుమతి రూ.30,116లను వైఎస్ఆర్ జిల్లా కాశినాయన మండలానికి చెందిన కామినేని వెంకటసాయి ప్రతాప్‌రెడ్డి ఎద్దులు సాధించాయి. ఐదవ బహుమతి రూ. 20, 116లను నంద్యాల జిల్లా పి.ఆర్.పల్లి గ్రామానికి చెందిన చిన్ననాగన్న ఎద్దులు గెలుచుకున్నాయి. ఈ బహుమతులను గ్రామ పెద్దలు శ్రీ రేణుకాయల్లమాంబ ఆలయం వద్ద ఎద్ల యజమానులకు అందజేశారు. అంతకు ముందు శ్రీ రేణుకాయల్లమాంబకు స్థానిక మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. భక్తులకు కడపకు చెందిన జరుగు రాజశేఖర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


బండను లాగుతున్న ఎద్దులు

• కమనీయంగా పుష్పయాగం


లక్ష్మీనరసింహస్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

పెండ్లిమర్రి : మండలంలోని వెయ్యినూతల కోన క్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం కమనీయంగా పుష్పయాగం నిర్వహించారు. ముందుగా స్వామి వారికి గణపతి పూజ, ఆకుపూజ వంటి కార్యక్రమాలను వేదపండితులు చేశారు. అనంతరం 12 రకాల పుష్పాలతో తిరుమల తిరుపతి దేవస్థానం విద్యార్థులచే 12 సార్లు లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి పుష్పయాగం చేశారు. గ్రామం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహా హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.